క్లుప్తంగా

గుండె జబ్బులపై అవగాహన తప్పనిసరి



రేపల్లె: వ్యాధులపై ప్రతిఒక్కరిలోకీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని డాక్టర్ మాధురి అన్నారు. గుండె సమస్యలు వచ్చిన సమయంలో చేసే ప్రథమ చికిత్సపై ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఒకటో వార్డు సచివాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. అదేవిధంగా గరువు రోడ్డులోని అర్బన్‌హెల్త్ సెంటరు ఆధ్వర్యంలో పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్‌లో ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. డాక్టర్ మాధురి మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చిన సమయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. సొంత వైద్యంతో ప్రాణాల కోల్పోయే పరిస్థితులు తెచ్చుకోవద్దని సూచించారు. ఈసందర్భంగా సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్‌లు తాటికొండ పద్మ, దామెర్ల శ్రీలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొల్లూరు విద్యార్థులకు బంగారు పతకాలు



కొల్లూరు: ఆటల పోటీలలో రాణించి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను తెనాలి డీఎస్పీ జనర్ధానరావు అభినందించారు. కొల్లూరు ఫోర్ ఫ్రంట్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి గరిక రిత్విక్, 6వ తరగతికి చెందిన మునిపల్లి పునీత్‌లు మంగళగిరిలో జరిగిన ఏరో స్కేట్ బాల్ పోటీలలో అండర్ 14 విభాగంలో పాల్గొని విజేతలుగా నిలిచారు. వీరిని తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు మంగళవారం అభినందించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన తెనాలికి చెందిన మైటీ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ రాకేష్‌కు భవిష్యత్తుతో మరింతమంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక అయ్యేలా తర్ఫీదును ఇవ్వాలని సూచించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



చుండూరు(వేమూరు): గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమని వేటపాలెం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి పోలె కోటేశ్వరరావు అన్నారు. చుండూరు మండలంలోని వేటపాలెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలివేరు గ్రామంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం - ఆడపిల్లలను కాపాడుకుందాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో మగ పిల్లలతో పాటు ఆడ పిల్లలకు సమాన హక్కులు ఉన్నాయన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని సూచించారు. నూతలపాటి పార్వతి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, దేవకుమారి, పోలేరమ్మ, శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ తరగతులు



అమర్తలూరు(వేమూరు): గ్రామ పంచాయతీలను క్లీన్ అండ్ గ్రీన్ గ్రామాలుగా మార్చేందుకు కృషి చేయాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీని క్లీన్ అండ్ గ్రీన్‌గా చేసే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. గ్రామ సర్పంచ్‌లు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఎంపీడీఓ మారుతీ శేషాంబ, జొన్నల గడ్డ వినయబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



తెనాలిటౌన్: బాలికలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు ఆఫీసర్ పి.విజయగౌరి సూచించారు. 8వ రాష్ట్రీయ పోషణమా కార్యక్రమాన్ని కఠెవరం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల కోసం ప్రత్యేక హెల్త్‌లైన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతను కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.యామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వసతుల కల్పనలో విఫలం

- మోకాలు లోతు నీళ్లల్లో ఉంటున్నా కనీసం పట్టించుకోని పాలకులు
- బాపట్ల గంగపుత్ర కాలనీ, ప్యాడిసన్ పేట జగనన్న కాలనీల్లో సీపీఎం నేతల పర్యటన



జగనన్న కాలనీలో నిలిచిన వర్షం నీటిని చూపుతున్న స్థానికులు, సీపీఎం నేతలు

బాపట్లటౌన్: పేదలకు కనీస వసతులు కల్పించడంలో కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. అకాల వర్షాలకు బాపట్ల పట్టణంలో నీట మునిగిన నివాస ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో వర్షపు నీరు నిలిచిన ఒకటవ వార్డు గంగపుత్ర కాలనీ, ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ ప్రాంతాలను సీపీఎం నేతలు సందర్శించారు. సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ వర్షపు నీరు నిలిచి ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు సంవత్సరాల తరబడి నివాసముంటున్న ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, తాగు నీరు సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. పేదప్రజలు మోకాల్లోతు వర్షపు నీటిలో తప్పని పరిస్థితుల్లో జీవనం సాగించాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో ప్రభుత్వం కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- గంగపుత్ర కాలనీ వంటి ప్రాంతాల్లో ప్రజల కనీస అవసరాలను తీర్చకుండా వారిచేత పన్నులు కట్టించుకుంటున్నారని గంగయ్య పేర్కొన్నారు. వర్షం కురిస్తే గృహాల్లోకి విషపూరిత పాములు సంచరిస్తున్నాయని, కాలనీల్లో అంతర్గత రోడ్లు నిర్మాణం నోచుకోక, తాగునీరు, విద్యుత్ వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. అనేక పర్యాయాలు కార్యాలయాలు చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కల్పించుకుని ఆయా కాలనీల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ బాపట్ల నాయకుడు కె. శరత్, జగనన్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, లోకేష్, భాగ్యలక్ష్మి, సల్మా, మునికుమారి, సాంబశివరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

లైసెన్స్‌ల మంజూరులో అలసత్వం తగదు

- నిబంధనల ప్రకారమే బాణసంచా వ్యాపారులు దుకాణాలు నిర్వహించాలి
- రేపల్లె ఆర్డీఓ నేలపు రామలక్ష్మి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ

రేపల్లె: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాసుల వ్యాపారాలు చేసుకునే వ్యాపారులకు తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేయటంలో అధికారులు ఏ మాత్రం అలసత్వం చూపరాదని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత రుసుము చెల్లించిన వారికి ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా లైసెన్స్‌లు మంజూరు చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది దీపావళి టపాసులు విక్రయాలు జరిపే ప్రదేశంలో నిత్యం వ్యాపారులకు అందుబాటులో ఉండాలన్నారు. విక్రయ కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణకై పోలీసు అధికారులు పహారా కాయాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ఆయా ప్రదేశాలలో పారిశుధ్యంను పరిరక్షించాలని సూచించారు. ఎవరైనా లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తే ఉపేక్షించరాదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటంతో పాటు టపాసులను సీజ్ చేయాలని సూచించారు.

- గతంలో కొన్ని గ్రామాలలో టపాసులు తయారు చేసేందుకు ఉపక్రమించి పేలుళ్లు సంభవించి పలువురు మృతి చెందటం, గాయపడటం వంటి అనుభవాలు ఈ ప్రాంతంలో ఉన్నాయని, ఇటువంటివి పునరావృతం కాకుండా పట్టణంలో, ఆయా గ్రామాలలో ప్రచారం చేయటంతో పాటు నిఘా ఉంచాలని సూచించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అదేవిధంగా వ్యాపారులు సైతం ప్రభుత్వ నిబంధనలను తు.చ. తప్పకపాటించాలన్నారు. మున్సిపాలిటి, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక తదితర కార్యాలయాల నుంచి విధిగా అనుమతులు పొందాలన్నారు. ఎవరైనా లైసెన్స్‌లు మంజూరు చేయటంతో ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్డీపీఓ ఎ.శ్రీనివాసరావు, సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చర్యలు

- బాపట్ల జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీరు ఆంజనేయులు
- చుండూరు మండలంలో సర్వీసులు తనిఖీ



చుండూరు విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో విద్యుత్ అధికారులు

చుండూరు(వేమూరు): విద్యుత్ అక్రమ విద్యుత్ వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు ఆంజనేయులు తెలిపారు. చుండూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం అధికారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుండూరు మండలంలో అక్రమ విద్యుత్ వినియోగదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలో 5,300 వినియోగదారుల సర్వీసులు తనిఖీ చేశారు. వాటిలో కమర్షియల్ కేటగిరికి చెందిన 248 సర్వీసులకుగానూ 34 సర్వీసుల్లో అదనపు లోడు గుర్తించడం జరిగిందన్నారు. వారికి రూ 1,27,800 జరిమానా విధించామన్నారు. అదేవిధంగా గృహాలకు సంబంధించిన 5037 సర్వీసులు తనిఖీ చేయగా రెండు సర్వీసులు విద్యుత్ మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. ఆ ఇద్దరు వినియోగదారులకు రూ 4వేలు జరిమానా విధించామన్నారు. శాంక్షన్ కేటగిరీ కాకుండా అదనపు కేటగిరి విద్యుత్ వాడుతున్న 8 సర్వీసులు గుర్తించి, వారికి రూ.35,500 అపరాధ రుసుం విధించామన్నారు. బాపట్ల డివిజన్ విజిలెన్సు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు భాస్కరరావు, చుండూరు డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రాజశేఖర్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీరు అర్జునరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఏదీ?

మండల ప్రజాపరిషత్ సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ

కొల్లూరు: ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. మంగళవారం కొల్లూరు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామాలలో జరిగే కార్యక్రమాల గురించి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లూరు ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షలతో, ఎటువంటి బడ్జెట్ అంశాలు చర్చించకుండా సాదాసీదాగా జరిగింది. మండలంలో జెడ్పీ, ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గాజుల్లంక ఎంపీటీసీ సభ్యుడు బావిరెడ్డి వెంకట్రామయ్య, తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్‌లు సభలో ప్రస్తావించారు. రహదారుల మరమ్మతుల అంశంపై ప్రశ్నిద్దామంటే మండల పరిషత్ సమావేశాలకు ఆర్‌అండ్‌బీ అధికారులు గైర్హాజరవడం ఏంటని ఎంపీడీఓ కె. నరసింహారావును ప్రశ్నించారు. ఈపూరులంక సర్పంచి మేకతోటి శ్రీకాంత్ తమ గ్రామంలో అసంపూర్తిగా నిర్మించిన రోడ్డు నిధుల విషయంతోపాటు, గ్రామంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, పంటలకు అవసరమైన యూరియా తమ సచివాలయం ద్వారా అందజేయాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో చర్చించిన అంశాలు, సమస్యలు పరిష్కారమవకుండా తిరిగి పునరావృతం అవుతున్నాయని ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లడంతో ఇకపై అటువంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా ఆర్‌ఎస్‌కేల ద్వారా పంపిణీ చేయకుండా టీడీపీ నాయకుల పర్యవేక్షణలో పంపిణీ చేయడంపై సభ్యులు ఏటను ప్రశ్నించారు. రబీ సాగులో యూరియా కొరత పునరావృతం అవ్వకుండా యూరియా పంపిణీ చేయాలని కోరారు. కొల్లూరు పీహెచ్‌సీలో రోగులను పట్టించుకునేవారు ఉండటంలేదని పనితీరు మెరుగు పరుచుకోవాలని సభ్యులు సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో నిర్మాణ రంగానికి ఊతం

కమర్షియల్ ట్యాక్స్ తెనాలి అసిస్టెంట్ అధికారి ముత్యాలు



మాట్లాడుతున్న కమర్షియల్ ట్యాక్స్ అధికారి ముత్యాలు

తెనాలిఅర్బన్: భవన నిర్మాణ రంగానికి జీఎస్టీ 2.0 ఎంతో ఊతమిచ్చిందని కమర్షియల్ ట్యాక్స్ తెనాలి అసిస్టెంట్ అధికారి ముత్యాలు పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ వేడుకను మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ సామగ్రిపై ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిదని తెలిపారు. దీని వలన నిర్మాణ ఖర్చులు తగ్గాయని చెప్పారు. అలాగే వైద్య రంగానికి సంబంధించిన అనేక వస్తువులపై జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలపై కూడా జీఎస్టీ తగ్గించినట్లు వివరించారు. ప్రజలందరూ వీటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జాగారాపు రామ అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ వలన ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. సమావేశంలో ఎంఈ పి.శ్రీకాంత్, ఏసీపీలు పి.శివన్నారాయణ, వి.వాణి, పట్టణంలోని పలు రంగాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీ' ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేణుగోపాల్



వేణుగోపాల్‌ను సత్కరించిన రాష్ట్ర అధ్యక్షుడు రాజా సిద్దార్థ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఆర్‌ఎంపీ అండ్ పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా తెనాలికి చెందిన నారాయణం వేణుగోపాల్ ఎన్నికయ్యారు. స్థానిక హోటల్‌లో మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు రాజా సిద్దార్థ, ప్రధాన కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్నుంచి వచ్చిన ప్రతినిధుల సమావేశంలో వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర, తెనాలి డివిజన్ ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు లభించేందుకు తన వంతు కృషిచేస్తానని హామీనిచ్చారు. తెనాలి డివిజన్ ప్రధాన కార్యదర్శి పుల్లారావు, కోశాధికారి రంగారావు, కోటేశ్వరరావు, భాస్కరరావు, వైఖానస సేవాసంఘం ప్రతినిధులు, బ్రాహ్మణ సేవాసమితి, బ్రాహ్మణ పరిషత్, వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య, ఆంధ్రప్యారిస్ బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం, అర్చక సమాఖ్య, అర్చక సేవా సంఘం. తిరుమల శ్రీ వైఖానస దివ్యసిద్ధాంత వివర్ధనీ సభ ప్రతినిధులు హాజరై వేణుగోపాల్‌కు అభినందనలు తెలియజేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



ఫిరంగిపురం: బాల్య వివాహాలతో అనర్థాలు కలుగుతాయని హెల్త్ సూపర్‌వైజర్ కె.సుదర్శన్‌రాజు చెప్పారు. మునగపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికదినోత్సవం సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే బాలికలకు అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. ప్రతి రోజూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ సుజాత, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లోని రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం మంగళవారం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి మాట్లాడుతూ బాలిక వారి కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజాభివృద్ధికి దోహదపడతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసన్న, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, అనురాధ, కార్డ్స్ సంస్థ జాయింట్ డైరెక్టర్ కె. పుష్పలత, ఆర్‌సీజేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డి.జీవన్‌మణిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పెంటర్లకు చేయూతనందించాలి

భట్టిప్రోలు: చేతి వృత్తి దారులైన కార్పెంటర్లకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించాలని పలువురు కార్పెంటర్లు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు భట్టిప్రోలు మండలంలోని కార్పెంటర్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వేమూరు నియోజకవర్గ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేతివృత్తి దారులందరిని సమానంగా ఆదరించాలన్నారు. అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్క కార్పెంటర్‌కు రూ.10వేలు ఆర్థికసాయం అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని వారు పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురవుతున్న కార్పెంటర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పునఃప్రారంభమైన తరలింపు పనులు



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయ తరలింపు ప్రక్రియ మంగళవారం పునఃప్రారంభమైనది. మున్సిపల్ కార్యాలయం ఎదురు ఉన్న మార్కెట్ భవనంలోకి కొన్ని కంప్యూటర్లు, ఫైల్స్‌ను, బీరువాలు, టేబుల్స్, కుర్చీలు వంటి వాటిని పంపారు. మేనేజర్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల సిబ్బంది వాటిని నూతన కార్యాలయంలో సర్దుకునే పనిలో ఉన్నారు. రెండు రోజుల్లో రెవెన్యూ, ఆరోగ్య విభాగం మినహా అన్ని సెక్షన్‌లను తరలించేందుకు కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు చర్యలు తీసుకుంటున్నారు. నూతన భవనంలోని నాల్గో ఫ్లోర్ రిపేర్లు చేసే వరకు రెండు విభాగాలు పాత భవనంలోనే కొనసాగే అవకాశం ఉంది.

పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ

ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీఎస్‌ఏ- ఎల్‌ఎస్‌డీజీ -5థీమ్‌లో భాగంగా పచ్చదనం -పరిశుభ్రత వంటి అంశాలపై సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్లు వద్ద పరిసరాల శుభ్రత, గ్రామంలో తడిపొడి చెత్త సేకరణ వంటి అంశాలను వివరించారు. పారిశుధ్య కార్మికులు తడిపొడి చెత్తను సేకరించి దానిని వేరుచేసి నిల్వ ఉంచి సంపద సృష్టించడంపై సూచనలు చేశారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

వేమూరు: మండల అభివృద్ధికి అధికారులందరూ పూర్తిగా సహకరించాలని ఎంపీపీ యల్లమాటి మోహనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. తమశాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులను రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ శాఖ అధికారులు పార్టీలకు అతీతంగా రైతులకు ఎరువులు అందజేయాలన్నారు. గ్రామాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటోందని, పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో దోమల నిర్మూలన కోసం చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలో సైడ్ కాలువలు మరమ్మతులు చేపట్టాలన్నారు. వేసవిలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలందరికీ పని కల్పించాలన్నారు. కొన్ని గ్రామ పంచాయతీలకు కొత్త కార్యదర్శులు రావడం జరిగిందన్నారు. ప్రతి కార్యదర్శి పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లోపించడం జరిగిందన్నారు. మండలంలోని పెండింగ్ ఉన్న సీసీ రోడ్లను పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ పి.రవి కుమార్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ సేవాసమితి సమావేశం



ఆహ్వానపత్రిక ఆవిష్కరించిన సేవాసమితి నాయకులు

తెనాలి: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు స్థానిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ కళాసదనంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సంబంధిత ఆహ్వానపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. సేవాసమితి గౌరవ అధ్యక్షుడు లక్కరాజు లక్ష్మణరావు వివరాలను తెలియజేశారు. మాగంటి వెంకట రత్నాకరశాస్త్రికి ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ పదవిని కల్పించిన తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వేదాశీర్వచనం ఉంటుందని తెలిపారు. దీంతోపాటు బ్రాహ్మణ కళాకారులకు చిరుసత్కారం, పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ, ఇటీవల లా కోర్సులో తొమ్మిది గోల్డ్ మెడల్స్ సాధించిన విజ్ఞాన్ లా కాలేజీ ప్రొఫెసర్ భాగవతుల నాగసాయిశ్రీరామ్‌కు అభినందన ఉంటాయని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు చివుకుల దుర్గాప్రసాద్, తేజోమూర్తుల నరసింహమూర్తి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ, దుర్గగుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ సుబ్రహ్మణ్య కుమార్, విజయవాడ కొతా ధర్మ సంస్థల అధినేత కొత సుబ్బారావు , తెలిదేవరపల్లి శ్యాంసుందర్ శర్మ, పట్టణ బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో సంస్థ ప్రతినిధులు త్రిపురారి పట్ల దత్తు , చెన్నాప్రగడ శ్రీనివాస్, విష్ణుపట్ల మణి కిషోర్, దావులూరి శ్యామ్‌సుందర్ శర్మ, నందివెలుగు రామకృష్ణశర్మ, కొడవటిగంటి కుమార్, అద్దేపల్లి మాధవశాస్త్రి, లక్కరాజు లక్ష్మణరావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దళిత వాడుకు వెళ్లే దారిలో కరకట్ట వెంట తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌కే చాంద్ బాషా గ్యార్మీ వేడుక సందర్భంగా గుంటూరు జిల్లా చందోలులో నివసించే బామరిది ఇంటికి కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. బీరువా చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. చాంద్ బాషా ఇంటో 3 జతల బంగారపు చెవి దుద్దులు, రెండు జతల బంగారు ఉంగరాలు, మొత్తం 16 గ్రాములు, వెండి 144 గ్రాముల వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. దీంతో పాటు రూ.36 వేల నగదు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గుంటూరు నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఎస్ఐ ప్రతాప్ త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

మరో సంఘటన..

సీతానగరంలో శనివారం ఓ మహిళ తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వేరే ద్విచక్రవాహనాన్ని అక్కడ నిలిపి ఆ మహిళ వాహనాన్ని చోరీ చేసినట్లు తెలియవచ్చింది.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కలిగిస్తున్న ఎయిమ్స్ వైద్యులు

మంగళగిరి టౌన్: సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిటిటేషన్) పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు పేర్కొన్నారు. సీపీఆర్‌పై వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి డ్రైవర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీలో హాస్పిటల్ సిబ్బందికి స్థానిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఎయిమ్స్ వైద్యులు మాట్లాడుతూ సీపీఆర్ ప్రక్రియ ద్వారా రోగిని కాపాడవచ్చని, ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ఈ నెల 17 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు రోగికి మెదడు, గుండె ఇతర ముఖ్య అవయవాలకు రక్తప్రసరణ ఆగిన సమయంలో సీపీఆర్ అవసరం అవుతుందని, ఇది చేస్తే అవయవాలకు ఆక్సిజన్ సరఫరా ఏర్పడి రోగి బతికే అవకాశాలు ఉంటాయని తెలియజేశారు. గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్సను అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలితే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడిన వారవుతారన్నారు. అనంతరం సీపీఆర్ ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు అనంత ప్రకాష్, విఘ్నేష్, నర్సింగ్ అధికారి రవి, డాక్టర్ విక్రమ్ కృష్ణ, వివేక్, ఆయా ప్రాంతాల యూపీహెచ్‌సీ వైద్యులు మానస, హర్షవర్ధన్, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఉర్దూ స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం షాజీర్ తదితరులు పాల్గొన్నారు.

- **రేపు శ్రీనివాస కల్యాణం**

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ గురువారం శ్రీనివాస కల్యాణం పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో బి. సురేష్ మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి కేరళ డీజీపీ చంద్రశేఖరఆజాద్ హాజరవుతారని పేర్కొన్నారు.